క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ బదిలీ


పి.సింహాచలం


కోన శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలాన్ని చీరాల మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన నెల రోజుల క్రితం పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన స్థానంలో నిడదవోలు మున్సిపల్ కమిషర్‌గా విధులు నిర్వహిస్తున్న కోన శ్రీనివాసరావును పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లకు బదిలీ చేశారు.

రూ.55 లక్షలతో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు


సుంకరి వీధిలో జరుగుతున్న ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రతి ఇంటికీ మంచినీరు సరఫరా చేసే కుళాయి కనెక్షన్లు వేయనున్నట్టు ఇందుకు ప్రజలు సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ కోరారు. సీతానగరం సుంకరివీధి జంక్షన్‌లో వేస్తున్న కొత్త పైపులు, కుళాయి కనెక్షన్లు తదితర పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ.55 లక్షలతో ఇంటింటి కుళాయి నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు ప్రతి ఇంటికీ కుళాయి పాయింట్‌లు ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డీఓ సమావేశం


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: పార్వతీపురం శాసనసభ నియోజకవర్గ పరిధిలో గల వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌డీఓ హేమలత మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా తదితర అంశాలను చర్చించారు. నియోజకవర్గంలో 134 ఓట్లు చేర్చామని, 51ఓట్లు తొలగించామని, 182ఓట్లు మార్పులు చేశామని ఆమె తెలిపారు. మార్పులు, చేర్పుల్లో అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండచీపుర్ల తయారీలో శిక్షణ

సాలూరు రూరల్: మండలంలోని అన్నంరాజు వలస గ్రామంలో వన్‌ధన్ వికాశ కేంద్రంలో 50మంది వీడీవీకే సభ్యులకు వెలుగు ఆధ్వర్యంలో కొండచీపుర్ల తయారీలో శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు శిక్షణను పరిశీలించారు. కొండచీపుర్లకు మార్కెట్లో మంచి గిరాకీ ఉందని, వాటిని తయారు చేసి విక్రయించడం ద్వారా జీవనోపాధి పొందాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు డీపీఎంలు తిరుపతి, అప్పారావు ఉన్నారు.

300 మందికి వైద్య సేవలు

సాలూరు రూరల్: మండలంలోని నేరెల్లవలస గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ అనిల్ పాల్గొని సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కొటియా సీఐ నారాయణరావు, రూరల్ సీఐ బాలకృష్ణ వైద్య సేవలను పర్యవేక్షించారు.

పీసా మహాసభలకు ఆహ్వానం

సీతంపేట: జార్ఖండ్ రాజధాని రాంచీలో వచ్చే నెల 4,5 తేదీల్లో నిర్వహించే పీసాచట్టం మహాసభలకు రాష్ట్రంలోని వివిధ ఐటీడీఏల నుంచి 11 మందిని ఎంపిక చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ముగ్గురికి ఆహ్వానాలు అందాయి. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయానికి ఆహ్వానాలు అందాయి. ఈ మహాసభలకు సీతంపేట ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ, శంబాం సర్పంచ్ నిమ్మక తిరుపతిరావు, కురుపాం మండలం గుజ్జివాయి సర్పంచ్ ఇమరక నాగేశ్వరరావు హాజరుకానున్నారు.

అరసాడలో సంక్షేమ కాంతులు


నాడు-నేడు పనులతో నిర్మించిన పాఠశాల


మధ్య అరసాడలో నిర్మించిన వాటర్ ట్యాంక్

- రూ.3కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాలతో ప్రజలకు అందిన లబ్ధి రూ.20.61కోట్లు


రైతు భరోసా కేంద్రం

బలిజిపేట: మండలంలోని అరసాడ సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయి. సచివాలయం పరిధిలో రూ.3కోట్లతో అభివృద్ధి పనులు జరగగా, ప్రజలకు వివిధ సంక్షేమ పథకాల ఫలాల కింద రూ.20.61కోట్లు అందాయి. గత ప్రభుత్వంతో పోల్చితే అభివృద్ధికి, సంక్షేమానికి ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేసినట్టు స్పష్టమవుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులలో భాగంగా సీసీ రోడ్లు, వీధి కాలువలు, కల్వర్టులు, మంచినీటి ట్యాంకుల నిర్మాణాలు, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి పథకం అమలు వంటివి అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తోంది.



అభివృద్ధి పనులు

సచివాలయం పరిధిలో రూ.40లక్షలతో సచివాలయ భవనం, రూ.21.80లక్షలతో రైతుభరోసా కేంద్రం, నాడు - నేడులో భాగంగా ఆస్పత్రి, పాఠశాల పనులకు రూ.1.63కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20లక్షలు, గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం మొదటి విడతలో రూ.25లక్షలు, సీసీ రోడ్లు, వీధి కాలువలు నిర్మాణాలకు రూ.60లక్షలు ఖర్చు చేశారు.

అభివృద్ధి, సంక్షేమం భేష్



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుపేదలకు సంక్షేమం అందించడంలో దేశ మొత్తం మీద అన్ని ప్రభుత్వాల కన్నా మన ప్రభుత్వమే ముందంజలో ఉంది. రాష్ట్రంలో తిరుగులేని పాలన సాగుతోంది. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోంది.

– పి.సుజాత, సర్పంచ్, అరసాడ, బలిజిపేట మండలం

పథకాల రూపంలో ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ)		
పథకం	లబ్ధిదారులు	నగదు
అమ్మ ఒడి	242	రూ.1.09కోట్లు
జగనన్న విద్యాదీవెన	289	రూ.70.75లక్షలు
జగనన్న వసతి దీవెన	194	రూ.34.87లక్షలు
రైతు భరోసా	552	రూ.2.51కోట్లు
పంటల బీమా	14	రూ.5.75లక్షలు
సున్నా వడ్డీ (పంట రుణాలపై)	173	రూ.3.63లక్షలు
వైఎస్సార్ పెన్షన్ కానుక	630	రూ.6.16కోట్లు
వైఎస్సార్ చేయూత	325	రూ.1.49కోట్లు
వైఎస్సార్ ఆసరా	626	రూ.93.86లక్షలు
డ్వాక్రా సున్నా వడ్డీ	729	రూ.9.21లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	04	రూ.1.95లక్షలు
ఈబీసీ నేస్తం	06	రూ.1.50లక్షలు
కళ్యాణమస్తు	09	రూ.6.0లక్షలు
ఆరోగ్య శ్రీ	150	రూ.39.28లక్షలు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	89	రూ.6.14లక్షలు
ఇళ్లు	93	రూ.1.33కోట్లు
వాహనమిత్ర	18	రూ.5.30లక్షలు
వైఎస్సార్ బీమా	10	రూ.14.15లక్షలు
నేతన్న నేస్తం	37	రూ.30 లక్షలు
జగనన్న చేదోడ	59	రూ.14 లక్షలు
ప్రత్యేక కోవిడ్ సహాయం	787	రూ.7.87లక్షలు
జగనన్న తోడు	46	రూ.28.77వేలు
నాన్ డీబీటీ పథకం కింద...		
పథకం	లబ్ధిదారులు	నగదు
ఇళ్ల స్థలాలు	115	రూ.2,82,90,000
విద్యాకానుక కిట్లు	137	రూ.9,72,974
ట్యాబ్‌లు	20	రూ.2,64,440
జగనన్న తోడు	79	రూ.14,70,901
జగనన్న గోరుముద్ద	127	రూ.12,58,189
సంపూర్ణ పోషణ	138	రూ.25,84,740
రేషన్	516	రూ.1,12,71,504


గ్రామంలో ఏర్పాటు చేసిన జల జీవన్ మిషన్ పైపులైన్లు


నాడు-నేడులో రూపురేఖలు మారిన పీహెచ్‌సీ


అరసాడ సచివాలయం

పోలమాంబకు ప్రత్యేక పూజలు



మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని మంగళవారం భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి ఆరో జాతరను పురస్కరించుకుని మంగళవారం వేకువజాము నుంచి వేలాది మంది భక్తులు శంబర గ్రామానికి చేరుకున్నారు. చదురుగుడి, వనంగుడిలో కొలువై ఉన్న పోలమాంబను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వనంగుడి వెనుక ఉన్న వేప చెట్టుకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారికి చీరలు, కోళ్లు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ వీవీ సూర్యనారాయణ, ఎస్సై పి.నరసింహమూర్తి చర్యలు చేపట్టారు.

తాగునీటి కంట్రోల్ రూం ఏర్పాటు

పార్వతీపురం: వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా పర్యవేక్షించేందుకు జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూంను జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూం పని చేస్తుందన్నారు. కంట్రోల్ రూంనకు సహాయ ఇంజినీర్ ఆర్.బసవ రాజు(9100120735) ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు జి.అనూష (96184 77479), ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పి.వసంత (85008 95315), సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్.శ్రీనివాసరావు (94938 22074) విధులను నిర్వహిస్తారన్నారు. తాగునీటి సమస్యలుంటే ప్రజలు తెలియజేయాలని సూచించారు.

పురపాలక సంఘం అభివృద్ధికి చర్యలు


సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఇతర సభ్యులు

- చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలక సంఘ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ అభివృద్ధికి సంబంధించి అజెండాను ప్రవేశపెట్టామన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణానికి సంబంధించిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేష్, మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని ములక్కాయవలస గ్రామంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల వీణ ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డుభద్రత నిబంధనలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పక ధరించాలని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని హిస్టరీ లెక్చరర్ మల్లీశ్వరి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఆర్థిక అక్షరాస్యతపై వ్యాసరచన పోటీలు

పార్వతీపురం టౌన్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను విద్యార్థులకు మంగళవారం నిర్వహించారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారం 2024 కార్యకలాపాల్లో భాగంగా పార్వతీపురం మండలం పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి ఐదు స్థానాలు పొందిన విజేతలకు లీడ్‌బ్యాంక్ మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి, ఎల్‌డీఎం అసోసియేట్ కె.మౌనిక, పాఠశాల ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ మూర్తి

విద్యాప్రమాణాలు పెంపొందించాలి


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సింహాచలం

పార్వతీపురం టౌన్: విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. మండలంలోని కృష్ణపల్లి, కొత్తూరు, చినమరికి, పెదమరికి పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. టీచర్ల డైరీలు, లెసన్ ప్లాన్లను తనిఖీ చేశారు. విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయులు డైరీలు, లెసన్‌ప్లాన్స్, వర్క్‌బుక్ కరెక్షన్లు సిలబస్ ప్రకారం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులతో తెలుగు, ఆంగ్ల పాఠాలను చదివించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనాభ్యాసన సామగ్రిని పరిశీలించి తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగించుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌కు 30 మంది ఎంపిక


కంటి ఆపరేషన్ల కోసం ఎంపికైన వృద్ధులు

కురుపాం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలతో బాధపడుతున్న వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, 30 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. కంటి సమస్యలైన కొయ్యకండ, అంతర కుసుమంతో బాధపడుతున్న పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారందరినీ మంగళవారం స్థానిక సీహెచ్‌సీ నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో తరలించారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడంతో పాటు కళ్లద్దాలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- ఎంపీపీ శెట్టి పద్మావతి

కురుపాం: యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ వీధిలో న్యూలైఫ్ మినిస్ట్రీ అధ్యక్షుడు మీసాల మురళి అధ్యక్షతన మంగళవారం సేవాభారత్ సెల్ఫ్ హెల్ప్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. సేవా భారత్ జిల్లా ఇన్‌చార్జ్ భీష్మ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ఫినాయిల్ తయారీ, సర్ఫ్ పౌడర్ తయారీ వంటి పది రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, మహిళా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పద్మ, చిట్టిబాబు, ప్రసాద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి శిక్షణకు హాజరయ్యారు.

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సింహాచలం

పార్వతీపురం టౌన్: పట్టణ పారిశుద్ధ్యంలో కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని, క్రమం తప్పకుండా ఇంటింటి చెత్తసేకరణ ఇలానే కొనసాగించాలన్నారు. ముఖ్యంగా పట్టణంలోని డస్ట్‌బిన్లు ఉండే ప్రదేశంలో పారిశుద్ధ్యం మరింత మెరుగు పరచాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, జనావాస ప్రదేశాల్లో వ్యాధులు ప్రబలకుండా క్లోరిన్ పిచికారీ చేయాలని సూచించారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డులను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, సూపర్‌వైజర్లు సాయి, కుమార్, భాస్కరరావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో డ్రాప్స్

మక్కువ: ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీడీఓ పి.దేవకుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ, ఎంఈఓ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవకుమార్

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా..

గుమ్మలక్ష్మీపురం: ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు కోరారు. మండలంలోని ఎస్టీ గొయిపాక గ్రామంలో ఎల్విన్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గొయిపాకతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలువురు రోగులకు డీఎస్పీ చేతుల మీదుగా మందులు అందజేశారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు దుప్పట్లు, గొడుగులను డీఎస్పీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ, ఎస్సై బి.శివప్రసాద్, సర్పంచ్ కారంగి లక్ష్మి, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, ఎంపీటీసీ కవిత, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జాయింట్ కార్యదర్శి నిమ్మక గోపాల్, దుడ్డుఖల్లు పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు మందులు అందజేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

కేదారిపురంలో ఆరోగ్య సురక్ష శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు శిబిరానికి తరలివచ్చారు. తాడికొండ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ శిబిరాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఆరోగ్య సురక్ష శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది